ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం

- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- వ్యర్థ జలాలు గెడ్డల్లోకి విడుదల
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు



...వివరాలు 7వ పేజీలో



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి జ్ఞాపిక అందజేస్తున్న చలపతిరావు, బత్తుల, ప్రగడ



స్పీకర్ అయ్యన్న, హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్‌లను సత్కరిస్తున్న దృశ్యం

మీ రుణం తీర్చుకోలేనిది

ఏడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, ఐదు సార్లు మంత్రిగా పని చేసే అవకాశం ఇచ్చారు

- నర్సీపట్నం నియోజకవర్గ వాసులను ఉద్దేశించి పౌర సన్మానంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూన్ 29:
ఏడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, ఐదు పర్యాయాలు మంత్రిగా పని చేశానంటే అది నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం వల్లే సాధ్యమైందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన పౌర సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్ని జన్మలు ఎత్తినా మీ రుణం తీర్చుకోలేనని ప్రజలను ఉద్దేశించి అన్నారు. ఐదేళ్లు నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పరిశ్రమలు తీసుకు వచ్చి యువతకు ఉపాధి అవకాశాలు చూపిస్తానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట ఇచ్చారని, కచ్చితంగా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని తెలిపారు. స్పీకర్ పదవి వచ్చింది... నర్సీపట్నంలో ఉండనని అనుకోవద్దని, తనకు నియోజవర్గ ప్రజలే ముఖ్యమన్నారు. తన కుమారులు విజయ్, రాజేశ్ ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఏ పని కావలసి వచ్చినా చేసి పెడతారని చెప్పారు. తాండవ, రావణాపల్లి రిజర్వాయర్లు, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి చేసుకోవలసిన అవసరం ఉందని, అధ్వానంగా ఉన్న రోడ్డు బాగు చేసుకోవాలని చెప్పారు. మీ మండలాలు, గ్రామాల్లో ఏ అభివృద్ధి పనులు కావాలో పేపర్ మీద రాసుకొని తనకు ఇవ్వాలని టీడీపీ నాయకులను ఉద్దేశించి అన్నారు. చంద్రబాబు ఒకటో తేదీన పెన్షన్ రూ.7వేలు ఇస్తున్నారని, నాయకులు దగ్గర ఉండి ఆ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. గత ఐదేళ్లు కేసులు పెట్టి దౌర్జన్యం చేసి ఇబ్బంది పెట్టారని, పోలీసులు తన మెడమీద చెయ్యి పెట్టి జీపులోకి ఎక్కించారని గుర్తు చేసుకున్నారు. కక్ష సాధింపు చర్యలు సరికాదని, ప్రజల రుణం తీర్చుకోవడమే ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు.

అయ్యన్న అందరికీ ఆదర్శం

రాజకీయాల్లోకి రావాలనుకునే వారికి అయ్యన్నపాత్రుడు ఆదర్శంగా నిలుస్తారని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు అవినీతి ఎరుగని నాయకుడని కొనియాడారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం పసుపు జెండాతో ఉంటానని, పసుపు జెండాతోనే పోతానని పార్టీ కోసం నిలబడ్డ నాయకుడు అయ్యన్నపాత్రుడు అని కొనియాడారు. అసెంబ్లీలో ... మిగతా 8వ పేజీలో



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న స్పీకర్ అయ్యన్న, పక్కన ఎంపీ, ఎమ్మెల్యేలు

చంద్రబాబుతో నూకాంబిక ఆలయాన్ని ప్రారంభిస్తాం

అనకాపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):
ఐదేళ్లుగా కొనసాగుతున్న నూకాంబిక అమ్మవారి ఆలయ పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ప్రారంభిస్తామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా శనివారం జిల్లాకు వచ్చిన ఆయనకు అనకాపల్లిలో కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభను హుందాగా నడిపించే శక్తిని ఇవ్వాలని అమ్మవారిని కోరుకున్నట్టు చెప్పారు. ఆయన వెంట ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఉన్నారు.

ఉద్యాన రైతులకు ఊతమేది ?



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ఎండిన, నాసిరకం మొక్కల పంపిణీ



మాట్లాడుతున్న గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు

- తోటల పెంపకంపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- ఏజెన్సీలో రోడ్ల నిర్మాణానికి నిధులున్నా జరగని పనులు
- ఇంకా డోలీ మోతలే కొనసాగాలా?
- జడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో సభ్యులు ధ్వజం

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):
ఉద్యాన వన తోటల పెంపకంలో భాగంగా రైతులకు ఎండిన, నాసిరకం మొక్కలు అందజేస్తున్నారని సభ్యులు ఆరోపించారు. శనివారం జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన రెండు, నాలుగోస్థాయీ సంఘ సమావేశాలు జడ్పీ హాలులో జరిగాయి. డ్వామా విభాగంపై జరిగిన చర్చలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ రైతులు కోరుకునే మొక్కలు కాకుండా అధికారులు తమకు ఇష్టమైన మొక్కలు ఇస్తున్నారన్నారు. అదే రైతులు తమకు ఇష్టమైన మొక్కను బయట మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.120 ఖర్చు చేసి కొనుగోలు చేస్తే అధికారులు మాత్రం దానికి రూ.30 చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ ఉద్యాన వన తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఈ దశలో అనకాపల్లి డ్వామా పీడీ సందీప్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత సీజన్‌కు ఎనిమిది లక్షల సరుగుడు నర్సరీ, 12 వేల కొబ్బరి, 36 వేల మామిడిమొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏజెన్సీలో డ్వామా విభాగం చర్చలో హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగా మత్స్యలింగం మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణాలను నిధులు ఉన్నా అధికారులు ఎందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంలేదని నిలదీశారు. ఇంకా డోలీమోతలు కొనసాగాలా? అని మండిపడ్డారు. అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్ల నిర్మాణాల కోసం అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకోవడంలేదని ఫిర్యాదుచేయగా జడ్పీ సీఈవో పోలినాయుడు జోక్యంచేసుకుని అటవీశాఖ నుంచి అనుమతి తీసుకోవాలని ఏఎస్సార్ జిల్లా డ్వామా పీడీ శివయ్యకు సూచించారు. మొదటగా జరిగిన రెండో స్థాయీ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో బాధ్యతలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలను అభినందిస్తూ మంచి పాలన అందించాలని ఆకాంక్షించారు. తరువాత డీఆర్‌డీఏపై జరిగిన చర్చలో గొలుగొండ, అనకాపల్లి జడ్పీటీసీ సభ్యులు గిరిబాబు, సత్యవతి మాట్లాడుతూ ఒకటో తేదీన ఇచ్చే పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గ్రామ, మండల స్థాయిలో ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుంటూ జూలై ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకి జడ్పీటీసీ సభ్యులకు ఆహ్వానించాలని, లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య అత్యంత నాసిరకంగా ఉందని, విద్యార్థులకు సరైన బోధనపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపడంలేదని సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకరదేవి మాట్లాడుతూ ఏడాది క్రితం వైఎస్సార్ ... మిగతా 8వ పేజీలో

నిబంధనలకు పాతర, అక్రమాల జాతర

ఏయూలో వీసీ ప్రసాదరెడ్డి ఇష్టారాజ్యం

- తనకు కావాల్సిన వారికి పోస్టింగ్‌లు... భారీగా వేతనాలు
- పోలీస్ శాఖలో రిటైరైన ఖాన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియామకం
- ఆయనకు అలవెన్సులతో కలిపి రూ.95 వేల వరకు చెల్లింపు





ఏయూలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ప్రసాదరెడ్డి అరాచకాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. ఆయన వీసీగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు భయపడిన ఎంతోమంది ఇప్పుడు గళం విప్పుతున్నారు. వర్సిటీ నిధులను ఆయన ఏ విధంగా దుర్వినియోగం చేసిందీ వివరిస్తున్నారు.

వర్సిటీలో చైర్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్...వంటి పేర్లతో కావాల్సిన వారికి కీలక విభాగాల్లో పోస్టింగ్స్ ఇచ్చిన వీసీ..వారికి భారీ మొత్తాలను చెల్లించినట్టు చెబుతున్నారు. అలాగే, గతంలో ఎన్నడూ లేని విధంగా కొన్ని కేడర్లు సృష్టించి మరీ ఉద్యోగాలు కల్పించి లక్షలాది రూపాయలు జీతాలుగా చెల్లించారు. రిటైరైన కృష్ణమోహన్‌ను ఓఎస్‌డీగా నియమించారు. ఇంకాఇంజనీరింగ్ కాలేజీకి కూడా ఓఎస్‌డీని వేశారు. అదేవిధంగా దూరవిద్యా కేంద్రానికి డైరెక్టర్‌గా ప్రైవేటు యూనివర్సిటీకి చెందిన వ్యక్తిని, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లుగా పలు కాలేజీలకు సంబంధించిన ముగ్గురిని నియమించారు. వీరికి భారీ మొత్తంలో యూనివర్సిటీ నిధుల నుంచి వేతనాలను చెల్లిస్తున్నారు. వీరితోపాటు కొన్ని విభాగాల్లో కిందిస్థాయిలో కొందరికి ఉద్యోగాలను వీసీ కల్పించినట్టు చెబుతున్నారు. అలాగే, గతంలో ఎన్నడూ లేనివిధంగా ... మిగతా 8వ పేజీలో

ప్రక్షాళన చేయాల్సిందే!!

- రాజీనామా చేసినా వెబ్‌సైట్‌లో ఇంకా ఆయన పేరే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సి ఉంది. ఉప కులపతి పదవి నుంచి ప్రసాదరెడ్డి తప్పుకున్నా ఆయన అడ్డగోలుగా నియమించిన అనేక మంది అక్కడ పాతుకుపోయారు. క్యాంపస్‌లో ఏమి జరిగినా క్షణాల్లో సమాచారం అందేలా ప్రసాదరెడ్డి ఏర్పాట్లు చేసుకున్నారు. ఏయూ వెబ్‌సైట్‌లో ఇంకా వీసీగా ఆయన పేరు, ఫొటో ఉన్నాయి. దీనిని పలువురు ప్రొఫెసర్లు ప్రశ్నిస్తే...తమకు పై నుంచి ఆదేశాలు రాలేదని, వచ్చేంతవరకూ అలాగే ఉంచుతామని వెబ్‌సైట్ నిర్వహించే బృందం చెప్పడం గమనార్హం. ఆయన సిబ్బందిని ఎలా తయారుచేసుకున్నారో చెప్పడానికి ఇదే పెద్ద ఉదాహరణ. ప్రసాదరెడ్డి రాజీనామా తరువాత అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ముగ్గురు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లు శనివారం క్యాంపస్‌కు వెళ్లారు. ఇంత జరిగినా వెబ్‌సైట్ నుంచి ఆయన పేరు తొలగించడానికి అక్కడి సిబ్బంది అంగీకరించలేదు. ఆయన రాజీనామాకు గవర్నర్ ఆమోదం లభిస్తే అప్పుడు తొలగిస్తానని చెప్పడం గమనార్హం.

ఆగని గ్రావెల్ దందా

- కొనసాగుతున్న అక్రమ తవ్వకాలు, రవాణా
- పట్టించుకోని అధికారులు

ప్రభుత్వం మారినా పంథా మార్చుకోని వైసీపీ నేతలు



అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద గ్రావెల్‌తో పట్టుబడిన లారీలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అనధికార గ్రావెల్ తవ్వకాలు, అక్రమ తరలింపు ఇంకా ఆగలేదు. ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే అక్రమ గ్రావెల్ దందా కొనసాగుతోంది. కొన్ని చోట్ల స్థానిక వైసీపీ నాయకులు అన్ని పార్టీల నేతలను కలుపుకుపోయి ఎప్పటిలాగానే గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలోని 24 మండలాల్లో గ్రావెల్ తవ్వకాలు, అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. స్థానిక రెవెన్యూ పంచాయతీ, పోలీసు అధికారులకు గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సమాచారం అందుతున్నా, వారి వాటాలు పుచ్చుకొని అక్రమ తవ్వకాలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో జిల్లాలో ఎక్కడికక్కడ గ్రావెల్ క్వారీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అనకాపల్లి మండలం సంపతిపురం పరిధిలో జగనన్న లేఅవుట్ మెరక పనులకు అంటూ గత రెండు నెలలుగా యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. కొందరు వైసీపీ నాయకులు అనకాపల్లి జాతీయ రహదారికి ఆనుకొని వున్న ఆవఖండం భూముల్లో ఉన్న ప్రైవేటు లేఅవుట్‌లకు గ్రావెల్ తరలిస్తున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. భట్లపూడి సర్వే నంబర్ 1లోని ప్రభుత్వ కొండ పోరంబోకు భూముల్లో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రామానికి శివారున మోద



సబ్బవరం మండలంలో ఒక ప్రైవేటు లేఅవుట్ వద్ద నిల్వ చేసిన గ్రావెల్

కొండమ్మ అమ్మవారి ఆలయానికి సమీపంలో స్థానిక నాయకుల అండదండలతో గ్రావెల్ అక్రమ తవ్వకాలు గత వారం రోజులుగా గుట్టుగా జరుగున్నా పట్టించుకున్న వారే కరువయ్యారు. ఇక్కడ నుంచి సమీపంలో కొప్పాక రైల్వే వంతెన వద్ద నిర్మాణంలో వున్న భారీ ప్రైవేటు లేఅవుట్‌కు గ్రావెల్ రవాణా చేసి మెరక పనులు చేస్తున్నారు. రెండు రోజుల కిందట సీతానగరం, వెంకుపాలెం, తగరంపూడి పరిసరాల్లో అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరిపి రవాణా చేస్తున్న రెండు లారీలను అనకాపల్లి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక నేతలు ఒత్తిడి తేవడంతో మొక్కుబడిగా జరిమానా కట్టించుకొని వదిలేశారు.

అనుమతులు లేకుండానే..

జిల్లాలో గ్రావెల్ తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వడం లేదని గనుల శాఖాధికారులు చెబుతున్నారు. గతంలో ఇచ్చిన లీజు అనుమతుల ప్రకారం గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ... మిగతా 8వ పేజీలో

300 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

చోడవరం, జూన్ 29: పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో 300 కిలోల గంజాయిని శనివారం ఉదయం పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. దీనికి సంబంధించి సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఏజెన్సీ నుంచి కారులో గంజాయిని తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ప్రధాన రహదారిపై మాటువేశారు. పోలీసులను చూసిన కారు డ్రైవర్ దారి మళ్లించే ప్రయత్నం చేశాడు. అయితే సిబ్బందితో కలిసి ఎస్ఐ శేఖరం చాకచక్యంగా పట్టుకున్నారు. కారులోని 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన అనంతపాంగి, కిముదు నిరంజన్‌లను అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ తెలిపారు.

చురుగ్గా అల్లూరి కళా మందిరం పనులు

- 4న ప్రారంభానికి సన్నాహాలు

కృష్ణాదేవిపేట, జూన్ 29: అల్లూరి సీతారామరాజు స్మారక పార్కులోని ఆడిటోరియంలో అల్లూరి చరిత్రకు సంబంధించి 30 చిత్రపటాలతో ఏర్పాటు చేస్తున్న కళా మందిరం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను శనివారం అల్లూరి జాతీయ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి చరిత్రకు సంబంధించి 30 చిత్రాలను తమ సంఘం నిధులతో పార్కులోని ఆడిటోరియంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే నెల 4న అల్లూరి జయంతి సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అల్లూరిపార్కు అభివృద్ధికి కోటి 16 లక్షల రూపాయల నిధులు ప్రకటించినా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, నిర్లక్ష్యం చేసి పార్కును శిథిలావస్థకు తీసుకువచ్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే రూ.30 లక్షలు కేటాయించడంతో పార్కు మళ్లీ పచ్చదనంతో కళకళలాడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శులు ఎల్.బాబ్జీ, శ్యామల వరలక్ష్మి, అంబటి వరహాలరాజు, సభ్యులు భాస్కరమణి, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చరిత్ర ఫొటోలతో ఏర్పాటు చేస్తున్న కళామందిరాన్ని పరిశీలిస్తున్న పడాల వీరభద్రరావు



ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

- వ్యర్థ జలాలు గెడ్డల్లోకి విడుదల
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు



గెడ్డలో నల్లగా దర్శనమిస్తున్న ఫార్మా వ్యర్థ జలాలు

పరవాడ, జూన్ 29 :

ఫార్మాసిటీలోని కొన్ని ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. ఫార్మా వ్యర్థ జలాలను గుట్టు చప్పుడు కాకుండా బయటకు విడిచిపెట్టడంతో అవి గెడ్డల్లో దర్శనమిస్తున్నాయి. పీసీబీ అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని ఫార్మా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పరవాడ నుంచి అనకాపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న స్థానిక మల్లోడి గెడ్డ కల్వర్టు వద్ద ఇరువైపులా ఫార్మా వ్యర్థ జలాలతో గెడ్డ నిండిపోయింది. ఈ కారణంగా అటుగా రాకపోకలు సాగించే వారంతా దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలతో నీరంతా నల్లగా మారింది. నెలల తరబడి నీరు అక్కడే నిల్వ ఉండిపోవడంతో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్లోడి గెడ్డ నుంచి ఫార్మా వ్యర్థ జలాలు నేరుగా పరవాడ సన్యాసిచెరువులో కలుస్తాయి. అక్కడి నుంచి పెద్ద చెరువులోకి కలుస్తాయి. సాగునీటి చెరువుల్లోకి ఫార్మా వ్యర్థజలాలు కలిస్తే పంటలు పండే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఫార్మా వ్యర్థ జలాల కారణంగా పరవాడ పెద్ద చెరువులో నాలుగు దఫాలు చేపలు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ ఫార్మా యాజమాన్యాల తీరు ఏ మాత్రం మారలేదు.

పత్తా లేని పీసీబీ అధికారులు

పెద్ద ఎత్తున ఫార్మా వ్యర్థ జలాలు గెడ్డల్లో దర్శనమిస్తున్నా పీసీబీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా వ్యర్థ జలాలను ఎట్టి పరిస్థితుల్లో కూడా బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ కొన్ని ఫార్మా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫార్మా పరిశ్రమలు ఘన, ద్రవ వ్యర్థాలను రాంకీ యాజమాన్యానికి అప్పగించాలి. ఇందుకుగాను రాంకీకి కొంత నగదు కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇదంతా ఖర్చుతో కూడుకున్న పని కావడంతో కొన్ని యాజమాన్యాలు గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థ జలాలను బయటకు విడిచిపెడుతున్నాయి. అటువంటి యాజమాన్యాలపై నిఘా పెట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పీసీబీ అధికారులపై ఉంది. అయితే ఇక్కడ మాత్రం పీసీబీ అధికారుల పర్యవేక్షణే లేకుండా పోయింది. దీంతో కొన్ని ఫార్మా యాజమాన్యాలు బరితెగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పరవాడ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



స్థానిక మల్లోడిగెడ్డ కల్వర్టు వద్ద ఇరువైపులా దర్శనమిస్తున్న ఫార్మా వ్యర్థ జలాలు

క్రైం... crime news

గంజాయి రవాణా కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు

- రూ.20 వేలు జరిమానా

చోడవరం, జూన్ 29: గంజాయి రవాణాలో కేసులో ముగ్గురు నిందితులకు స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రెండేళ్ల జైలుశిక్షతో పాటు, రూ.20 వేలు జరిమానా విధిస్తూ శనివారం తీర్పు చెప్పారు. ముంచంగిపుట్టు మండలం మకరం గ్రామానికి చెందిన ప్రధాని నాగేశ్వరరావు (40), ముఖి సిద్దేశ్ (35) ముఖి మోహన్(40)లు 2016, అక్టోబరు 25న స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మూడు గోనెసంచుల్లో 15 కిలోల గంజాయిని తరలిస్తుండగా, అప్పటి ఎస్ఐ నరసింహమూర్తి దాడి చేసి పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి శనివారం జిల్లా జడ్జి తుది తీర్పు ఇస్తూ ముగ్గురు నిందితులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 5 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు. ఈ కేసులో అడిషనల్ పీపీగా వేసలపు వెంకటరావు వ్యవహరించారు.

బాలుడి ఆత్మహత్య

కూర్మన్నపాలెం, జూన్ 29: ప్రేమ విఫలం కావడంతో మనస్తాపానికి గురైన ఓ బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం ఆరారియా జిల్లాలోని సిరిసియా హనుమాన్ గంజ్ గ్రామానికి చెందిన రవీంద్ర రజాక్ అనే యువకుడు యాదవ జగ్గరాజుపేట వద్ద సమీపంలోని హీరావాట్ క్లాత్ కంపెనీలో గత రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. కాగా పది రోజుల క్రితం రవీంద్ర సోదరుడు శర్వణ్‌కుమార్ (16) విశాఖ నగరాన్ని చూద్దామని ఇక్కడకు వచ్చాడు. శుక్రవారం కూరగాయాలు తెచ్చేందుకు రవీంద్ర తన స్నేహితులతో కలిసి మార్కెట్ వెళ్లి వచ్చేసరికి తన తమ్ముడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని శర్వణ్‌కుమార్ కనిపించడంతో రవీంద్ర తమ యజమాని అశోక్‌కుమార్‌కు సమాచారం అందించాడు. ఆయన హుటాహుటిన వచ్చి తన కారులో శర్వణ్‌కుమార్‌ను కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తన తమ్ముడు తమ గ్రామంలో ఓ అమ్మాయిని ప్రేమించాడని, ప్రేమ విఫలం కావడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రవీంద్ర పోలీసులకు తెలిపాడు. మృతుడి తండ్రి బోలా రజాక్ వ్యవసాయదారుడు, తల్లి రాధాబాయ్ గృహిణి. వీరికి ఐదుగురు కుమారులు. రవీంద్ర ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 మంది పోలీస్ అధికారుల పదవీవిరమణ



పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారులతో ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 29 : జిల్లా పోలీస్ కార్యాలయ పరిధిలోని పనిచేస్తున్న తొమ్మిది మంది అధికారులు శనివారం పదవీవిరమణ పొందారు. క్రైం ఏఎస్పీ సత్యనారాయణరావు, డీటీసీ డీఎస్పీ రామవర్మ, మాకవరపాలెం ఎస్ఐ సన్యాసిరావు, బుచ్చెయ్యపేట ఎస్ఐ నాయుడు, వి. మాడుగుల ఎస్ఐ నాగరాజు, ఆర్ఎస్ఐ వెంకటరావు, నాతవరం ఏఎస్ఐ బంగార్రాజు, కె. కోటపాడు ఏఎస్ఐ రాముడు, ఆర్మీ రిజర్వుడ్ ఎస్ఐ శంకరరావు పదవీవిరమణ పొందారు. వీరిని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సత్కరించి, వీరంతా పోలీస్‌శాఖకు అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రికి పది ప్రత్యేక బస్సులు

ద్వారకా బస్‌స్టేషన్, జూన్ 29: ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం శనివారం విశాఖపట్నం నుంచి రాజమండ్రికి పది ప్రత్యేక బస్సులను నడిపింది. రీజియన్‌లోని విశాఖ, మద్దిలపాలెం డిపోల నుంచి వీటిని ఎంపిక చేసి ప్రత్యేక సర్వీసులుగా నడుపుతున్నారు. నిడదవోలు-కడియం స్టేషన్ల మధ్య రైల్వేట్రాక్‌ల నిర్వాహణ పనులను రైల్వే శాఖ చేపట్టడంతో ఈ స్టేషన్ల మీదుగా విశాఖకు రాకపోకలు సాగించాల్సిన జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్ వంటి పలు రళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. శనివారం ఉదయం నుంచి ప్రయాణికుల డిమాండ్ అధికంగా ఉండడంతో ఆర్టీసీ అధికారులు విశాఖ-రాజమండ్రిల మధ్య ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నారు. విశాఖ నుంచి రాజమండ్రికి ఉదయం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు 40 నిమిషాల ఫ్రీక్వెన్సీతో బస్సులు ఉన్నప్పటికీ ప్రయాణికుల తాకిడి అధికంగా ఉండడంతో శనివారం పది ప్రత్యేక సర్వీసులను నడిపారు. డిమాండ్ ఇంకా కొనసాగితే మరిన్ని బస్సులు నడుపుతామని ఆర్టీసీ రీజియన్ అధికారులు తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ

విశాఖపట్నం, జూన్ 29 : డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి డైరెక్టర్ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు వచ్చే నెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 200 మంది అభ్యర్థులకు రెండు నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైపండ్ రూ. 3 వేలు, రూ. వెయ్యి విలువైన స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, టీటీసీ, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు మాత్రమే), ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జత చేసి, బీసీ స్టడీ సర్కిల్, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నం అన్న చిరునామాకు నేరుగా పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 94925 69177లో సంప్రతించాలని ఆమె సూచించారు.

నేటి నుంచి ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టోర్నీ



ట్రోఫీ ఆవిష్కరణలో పాల్గొన్న జట్ల సారథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 29: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 టోర్నీ ఆదివారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ప్రారంభం కానున్నది. ఇందుకు సంబంధించిన ట్రోఫీ ఆవిష్కరణ శనివారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టోర్నీలో పాల్గొనే ఆరు ఫ్రాంఛైజర్ల జట్ల జెర్సీ యూనిఫామ్‌లను ఆవిష్కరించడంతోపాటు ఆటగాళ్లను పరిచయం చేశారు. విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం, కడప స్టేడియంలలో జూలై 13వ వరకు జరిగే ఈ టోర్నీలో రాయలసీమ కింగ్స్, గోదావరి టైటాన్స్ కోస్టల్ రైడర్స్ ఉత్తరాంధ్ర లయన్స్, బెజవాడ టైగర్స్, వైజాగ్ వారియర్స్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి మాట్లాడుతూ గత సీజన్లతో పోల్చితే సీజన్-3 టోర్నీని మరింత ఉన్నత స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేశామన్నారు. కార్యక్రమంలో ఏసీఏ ప్రతినిధులు, ఏపీఎల్ గవర్నింగ్ బాడీ సభ్యులు, ఐదు జట్ల సారథులైన కేఎస్ భరత్, రిక్కీబుయ్, గిరినాథరెడ్డి, జ్ఞానేశ్వర్, రషీద్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

నూకాంబికను దర్శించుకున్న స్పీకర్ అయ్యన్న



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న అయ్యన్న పాత్రుడు



స్పీకర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ సీఎం రమేశ్, దాడి, పీలా

అనకాపల్లి టౌన్, జూన్ 29: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారిని శనివారం సాయంత్రం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దర్శించుకున్నారు. తొలిసారిగా వచ్చిన అయ్యన్నపాత్రుడుకు ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, వేదపండితుల ఆశీర్వాచనాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయ్యన్న అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి బాలాలయంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందజేశారు. స్పీకర్‌ని ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ యువ నాయకుడు దాడి జయవీర్ ఘనంగా సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం పునర్నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని, అమ్మవారి గర్భగుడిని పరిశీలించి నిర్మాణ పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత, అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఈవో బండారు ప్రసాద్, ఆర్డీవో చిన్నికృష్ణతో పాటు టీడీపీ నాయకులు బుద్ద నాగజగదీశ్వరరావు, పీలా శ్రీనివాసరావు, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, కొణతాల రత్నకుమారి, కోట్ని బాలాజీ, బీఎస్ఎంకే జోగినాయుడు, మళ్ల సురేంద్ర, సబ్బవరపు గణేశ్, బీజేపీ నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, జనసేన నాయకులు పీలా నాగశ్రీను, పొల్నాటి అప్పారావు, కర్రి సత్యనారాయణ, మళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 29: అసెంబ్లీ సభాపతిగా ఎన్నికై జిల్లాకు వచ్చిన చింతకాయల అయ్యన్నపాత్రుడుకు విశాఖ విమానాశ్రయంలో శనివారం ఘన స్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ విశాఖ విమానాశ్రయంలో శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు జ్ఞాపికను అందజేసి స్వాగతం పలికారు.

2న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

చోడవరం, జూన్ 28: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చే జూలై 2న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాధాకృష్ణ తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 12 ప్రముఖ కంపెనీలుహాజరుకానున్నాయని చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన విద్యార్థులు ఈ జాబ్‌మేళాను వినియోగించుకోవాలని సూచించారు. ఈ జాబ్‌మేళాకు సంబంధించిన పూర్తి వివరాలు కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి సీనియర్ లెక్చరర్ హెచ్.సుధీర్ ఫోన్: 77806 88683లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం



అర్థగణాంక పితామహుడు మహాలనోబిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 29: కలెక్టరేట్‌లోని అర్థ గణాంక శాఖ కార్యాలయంలో శనివారం జాతీయ గణాంక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అర్థగణాంక శాఖ అధికారి రామారావు హాజరై అర్థగణాంక పితామహుడు మహాలనోబిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పాత భవనంలోనే అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభం



అనకాపల్లిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్న భవనం

అనకాపల్లి టౌన్, జూన్ 29: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలోని గతంలో నిర్వహించిన భవనంలోనే మరికొద్ది రోజుల్లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. అన్న క్యాంటీన్ మూసివేసిన తర్వాత ఆ భవనంలో ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్ కొనసాగింది. ప్రస్తుతం ల్యాబ్ పనిచేయడం లేదు. ఇందులో విలువైన పరికరాలు ఉన్నాయి. దీంతో అన్న క్యాంటీన్‌ను వేరొక భవనంలో ఏర్పాటు చేయాలని ఎన్టీఆర్ వైద్యాలయం, జీవీఎంసీ అధికారులు భావించారు. ఇందుకు సంబంధించి జీవీఎంసీ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అయితే అనుకున్న భవనం రోడ్డు పాయింట్‌లో లేకపోవడం, చిన్నది కావడంతో అధికారులు ఆ భవనంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి అంగీకరించలేదు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యాలయం ఆవరణలోని రోడ్డుకు ఆనుకుని ఉన్న పాత భవనంలోనే అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు క్యాంటీన్ భవనంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పాత భవనంలో ఉన్న ల్యాబ్ పరికరాలన్నీ మరో భవనంలోకి శనివారం మార్పు చేశారు. త్వరలోనే అన్ని హంగులతో భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేయనున్నారు.

జడ్పీటీసీ సభ్యత్వానికి మత్స్యలింగం రాజీనామా



విశాఖ ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్‌కు జడ్పీటీసీ పదవికి రాజీనామా పత్రం అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగా మత్స్యలింగం

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగా మత్స్యలింగం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం విశాఖ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్‌కు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అరకు అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ నేపథ్యంలో ఆయన హుకుంపేట జడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు.

లోక్‌అదాలత్‌లో రాజీతో మేలు

- జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య
- 82 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి టౌన్, జూన్ 29: లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకుంటే కక్షిదారులకు మేలు చేకూరుతుందని పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య మాట్లాడుతూ అనవసరమైన తగాదాలతో కేసుల్లో ఇరుక్కుని ఏళ్ల తరబడి పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఆర్థికంగా కూడా సమస్యలు తలెత్తుతాయన్నారు. రాజీ మార్గంతో సమస్యలు పరిష్కరించుకుని కుటుంబంతో హాయిగా ఉండా లని సూచించారు. సమావేశంలో రెండో జూనియర్ సివిల్‌జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎన్ కుమార్, కార్యదర్శి బంధం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ లోక్ అదాలత్‌లో 82 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి.

లోక్ అదాలత్‌లో 79 కేసులు పరిష్కారం

నర్సీపట్నం: న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 79 కేసులను పరిష్కరించారు. శనివారం కోర్టు సముదాయంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పటాన్ షియాజ్ ఖాన్ 28, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదనరావు 51.. మొత్తం 79 కేసులు రాజీ మార్గంలో పరిష్కరించారు. డీఎస్పీ మోహన్, న్యాయవాదులు, వివిధ ప్రాంతాల నుంచి కక్షిదారులు పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి వాకర్స్ క్లబ్ రూ.లక్ష విరాళం



అమరావతి నిర్మాణానికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న నర్సీపట్నం వాకర్స్ క్లబ్ సభ్యులు

నర్సీపట్నం, జూన్ 29 : అమరావతి నిర్మాణానికి నర్సీపట్నం వాకర్స్ క్లబ్ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. శనివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన పౌర సన్మాన కార్యక్రమంలో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, సీఎం రమేశ్‌కి ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడ, ఉపాధ్యక్షుడు కామిరెడ్డి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ కుప్పిలి మూరళీ, కుప్పిలి స్వామి, ఊడా వెంటకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మైమరిపించిన మాయాబజార్

- ఘనంగా సురభి నాటకోత్సవాలు ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 29: పితాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం రంగసాయినాటిక సంఘం ఆధ్వర్యంలో సురభి నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన మాయాబజార్ నాటిక సభికులను మైమరిపించింది. శశిరేఖ పరిణయం కథతో సాగే మాయాబజార్‌లో కళాకారులు అద్భుత నటనతో కనువిందు చేశారు. మద్యపాన మత్తులో బలరాముడు నారదుడ్ని తూలనాడడం, దీనికి ఆగ్రహించిన నారదుడు రేవతీదేవి వద్దకు వెళ్లి శశిరేఖకు అభిమన్యుడు కంటే ఉత్తర కుమారుడికి ఇచ్చివివాహం చేయడం మేలని కలహం రేపించే సన్నివేశాలు రక్తి కట్టించారు. శశిరేఖను అపహరించడానికి వచ్చిన ఘటోత్కచుడ్ని శ్రీకృష్ణుడు వృద్ధుడి మారు వేషంలో అడ్డుకునే చమత్కార ప్రదర్శనలు నవ్వులు పూయించాయి. ఘటోత్కచుడు శశిరేఖ రూపంలో ఉత్తర కుమారుడి పక్కన పెండ్లి పీటలపై చేసిన అల్లరి, పరాభవించే సన్నివేశాలు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించి అభిమానుల కరతాళధ్వనులు చూరగొన్నారు. చివరకు శశిరేఖ అభిమన్యుల వివాహంతో మాయబజార్ నాటిక ముగిసింది. ఈ కార్యక్రమంలో విజయ నిర్మాణ సంస్థ అధినేత విజయకుమార్, రంగసాయి నాటిక నిర్వాహకుడు బాదంగీర్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

FLATS FOR SALE

★ **1250 sft.,** East Facing New Flats for Sale at Madhurawada (Near RTC Colony). 45 Lakhs only. Cont.: 9014202661, 7794846427
AJV_183440

PLOT FOR SALE

★ **SK Builders & Developers Beach Aero City.** VMRDA Approved Plots. L.P. No.37/2023. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి అతి చేరువలో మరియు బీచ్‌కి ఆనుకొని 150 అ॥ రోడ్ ఫేసింగ్ * ఫ్యామిలీతో ఫారన్ ట్రిప్ * ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే. బ్యాంక్ లోన్ సదుపాయం. సంప్ర॥ 9885535454
AJV_192970

★ **267 sq.yds.,** W/F, Very Near to Kalabharathi, Pithapuram Colony, Nr. CMR Central, Plot for Sale. Cont.: 7780654605
AJV_3936

★ **400 sq.yds.,** North Facing at Sheelanagar, 534 sq.yds. West Facing @ Devi Metta, Kommadi for Sale. Cont.: 7780654605
AJV_3937

- **VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ.** బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ.గ. 1,900/- నుండి 18,500/- సంప్ర : **73373 11924**
AJB_30

AYURVEDIC

★ హెర్బల్ ఆయుర్వేదం 18 నుండి 75 వయస్సున్న వాళ్ళు శృంగారంలో తృప్తిని పొందుటకి మందులు వాడండి. ఇంద్రియ ఘాత్రాన్ని పెంచుకోండి. శృంగార సమయాన్ని 45 నిమిషాలకు పెంచుకోండి. స్త్రీలకు మందులు లభ్యం. ధన్వంతరి ఆయుర్వేదం. ఫోన్ : 7411506650 AJH-001962

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

లోక్ అదాలత్‌లో 112 కేసులు పరిష్కారం



ఎలమంచిలి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

ఎలమంచిలి, జూన్ 29 : జాతీయ లోక్ అదాలత్‌ను ఎలమంచిలి కోర్టు పరిధిలో శనివారం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వి.స్వాతి భవానీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.వీర రాఘవేంద్రరావుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 112 కేసులు పరిష్కారమయ్యాయి. లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'పాఠశాలల్లో పక్కాగా మధ్యాహ్న భోజనం'



భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈవో

సబ్బవరం, జూన్ 29 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కగా అమలు చేయాలని ఎంఈవో-2 బీఎస్ఎన్ మూర్తి సూచించారు. శనివారం ఇక్కడి ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పిల్లలకు వడ్డించే మధ్యా భోజనాన్ని రుచి చూసి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

ఉద్యాన రైతులకు ఊతమేది?

... 5వ పేజీ తరువాయి

బడుగు వికాశ్ కింద వాహనం కొనుగోలుచేసి సబ్సిడీకి జిల్లా పరిశ్రమల కేంద్రానికి దరఖాస్తు చేస్తే ఇప్పటి వరకు పలు రకాల కొర్రీలు వేస్తున్నారని ఆరోపించారు. జడ్పీటీసీ సభ్యురాలిగా తన పరిస్థితే ఇలా ఉంటే సామాన్య ప్రజలను అసలు పట్టించుకుంటారా? అని ఆవేదన వ్యక్తంచేయగా సీఈవో పోలినాయుడు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారికి ఆదేశించారు.

ఎమ్మెల్యేలకు త్వరలో కమిటీలో స్థానం

ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్యేలను త్వరలో జిల్లా పరిషత్ స్థాయి సంఘాల్లో సభ్యులుగా నియమించనున్నట్టు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. శనివారం జడ్పీ హాలులో ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ వచ్చే సర్వసభ్య సమావేశంలో నియామకాలు పూర్తిచేస్తామన్నారు. అరకులోయ ఎమ్మెల్యేగా ఎన్నికైన హుంకుంపేట జడ్పీటీసీ సభ్యుడు ఆర్.మత్స్యలింగంను ఈ సందర్భంగా అభినందించారు.

ఆగని గ్రావెల్ దందా

... 5వ పేజీ తరువాయి

రద్దు చేసినట్టు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన గ్రావెల్ క్వారీల నిర్వాహకులు గనులు, కమర్షియల్ ట్యాక్స్ శాఖలకు జీఎస్టీ కింద చదరపు క్యూబిక్ మీటరు గ్రావెల్ తవ్వినందుకు రూ.100 వరకు చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో పలు మండలాల్లో ప్రధానంగా అనకాపల్లి, సబ్బవరం, అచ్యుతాపురం, పరవాడ, కశింకోట మండలాల్లో కొందరు రియల్టర్లు స్థానిక నాయకులతో చేతులు కలిపి ఎటువంటి అనుమతులు పొందకుండానే ఇష్టానుసారంగా ప్రభుత్వ భూముల్లో సైతం గ్రావెల్ తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్టు వేయాలని కోరుతున్నారు. జిల్లాలో గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్న వైనంపై గనుల శాఖ ఏడీ సబ్బారాయుడును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా గ్రావెల్ తవ్వకాలకు కొత్తగా ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. సబ్బవరంలో పది మందికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల ప్రకారం కొత్తగా గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని, అంత వరకు ఎవరికీ గ్రావెల్ తవ్వకాలు అనుమతులు లేవని స్పష్టం చేశారు.

మీ రుణం తీర్చుకోలేనిది

... 5వ పేజీ తరువాయి

చంద్రబాబును తీవ్రంగా అవమానించిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా లేకుండా పోయిందని, ఇదే దేవుడి స్క్రిప్ట్ అని అన్నారు. ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కలిసి సభాపతిని చైర్‌లో కుర్చోబెట్టడం సంప్రదాయమని, జగన్‌మోహన్‌రెడ్డికి ఆ ఇంకిత జ్ఞానం కూడా లేదన్నారు. అటువంటి వ్యక్తిని ఐదేళ్లు సీఎంగా భరించామని ఎద్దేవా చేశారు. అందుకే ఎన్నికలలో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి తరిమి తరిమి కొట్టారని విమర్శించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్‌లను నాలుగు మండలాలు, మునిసిపాలిటీ పార్టీ నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి విజయ్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, సుందరపు విజయ్‌కుమార్, కేఎస్ఎన్ రాజు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు, తోట నగేశ్, జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర, జడ్పీటీసీ సుకల రమణమ్మ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అభినందన

కొణతాలను కలిసిన అధికారులు



కొణతాలకు శుభాకాంక్షలు తెలిపి సమస్యలు వివరిస్తున్న అధికారులు

కొత్తూరు, జూన్ 29 : ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను పలు శాఖలకు చెందిన అధికారులు, పలు సంఘాల నయకులు, కూటమి శ్రేణులు శనివారం కలిశారు. అనకాపల్లి పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న జనసేన కార్యాలయంలో ఎంపీడీవోలు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, ఏపీఈపీడీసీఎల్, చెరకు పరిశోధనస్థానం అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు. ప్రజలు వివరించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడంలో అంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నివేదన

'సింహాద్రి'లో ఉద్యోగాలకు వినతి



ఎమ్మెల్యే పంచకర్లకు వినతి పత్రం అందిస్తున్న నిర్వాసితులు

పరవాడ, జూన్ 29 : సింహాద్రి ఎన్టీపీసీలో శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని భూనిర్వాసితులు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం పెందుర్తి ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. 2010లో ఎన్టీపీసీలో శాశ్వత ఉద్యోగాల కోసం పరీక్ష రాసి పాసైన వారిలో సగం మంది నిర్వాసితులకు మాత్రమే శాశ్వత ఉద్యోగాలు కల్పించారన్నారు. దీనిపై పంచకర్ల మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎంపీ సీఎం రమేష్ దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే సంస్థ యాజమాన్యంతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి నిర్వాసితులకు న్యాయం చేస్తామని చెప్పినట్టు నిర్వాసితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు వెలుగుల అనిల్‌కుమార్, గండి వెంకటరావు, పైలా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సందర్శన

అభివృద్ధి పనులు పరిశీలన



జంక్షన్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, జూన్ 29 : మండల కేంద్రం అచ్యుతాపురం జంక్షన్ అభివృద్ధికి అంతా సహకరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఇక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం పరిశీలించి మాట్లాడారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో స్థానికులతో పాటు వివిధ కర్మాగారాలకు వచ్చే అతిథులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలతో కూడిన వసతులు ఉన్నప్పటికీ పారిశుధ్యం లోపించడంతో అతిథులు గాజువాక, విశాఖపట్నంలో గల హోటళ్లలో బసచేస్తున్నారన్నారు. ఇకపై అటువంటి పరిస్థితులు తలెత్తకుండా అందరి సహకారంలో తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. నాయకులు బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

- రాంబిల్లి మండల సమావేశంలో ఎమ్మెల్యే విజయకుమార్ వెల్లడి
- సమస్యలపై గగ్గోలు పెట్టిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు



సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, జూన్ 29 : రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. శనివారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జి.శిరీషా అధ్యక్షతన ఏర్పాటైన రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల్లో గెలుపొంది తొలిసారిగా ఇక్కడికి విచ్చేసిన ఆయనకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమష్టిగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. పలువురు సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందన్నారు. వాడనర్సాపురం, కొత్తపట్నం, కృష్ణంపాలెం పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు కారే రామారావు, వెంకటేశ్వరులు, సత్తిబాబులు మాట్లాడుతూ గ్రామాల మధ్యలో ఏళ్లక్రితం నిర్మించిన తుఫాన్ రక్షిత షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని జడ్పీటీసీ ధూళి నాగరాజు వివరించారు. వెంకటాపురం పంచాయతీలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని సర్పంచ్ తాతబ్బాయి పేర్కొన్నారు. అటవీ శాఖ స్థలంలో ఏళ్ల కాలంగా రైతులు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఈ భూములను నేవీకి సదరు అధికారులు అప్పగించడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని చినకలవలాపల్లి సర్పంచ్ వై.శ్రీనివాసరావు వివరించారు. అటవీ భూముల్లో వీఎస్ఎస్ ఏర్పాటు చేసుకొని సాగు చేసిన రైతులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చేలా చూడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మేజర్, మైనర్ శారదా నదులు గట్లు బలహీనంగా ఉన్నందున, నదుల్లో నీటి ఉధృతి పెరిగితే ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గోకివాడ ఆనకట్ట, ఏడముళ్ల ఆనకట్టల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి ఆధునికీకరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీవో వెంకటాచలం, తహసీల్దార్ అప్పలస్వామి, వైస్ ఎంపీపీలు కశిరెడ్డి నర్సింగరావు, కొటాపు లక్ష్మిలతో పాటు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గోపాలపట్నం వద్ద ఆవ గేట్లు పరిశీలన

పాయకరావుపేట రూరల్, జూన్ 29 : మండలంలోని గోపాలపట్నం సమీపంలో ఉన్న ఆవ కొత్తగేట్లను నీటిపారుదల శాఖ ఏఈ శ్రీరామ్మూర్తి శనివారం పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆవ కొత్త గేట్లు మధ్య పిల్లర్ దెబ్బతింది. ఆవ నుంచి గోపాలపట్నం, పెంటకోట, గునుపూడి, బంగారమ్మపేట తదితర గ్రామాల్లోని సుమారు 2,500 ఎకరాలకు నీరందుతుంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. భారీ వర్షాలకు ఆవ పూర్తిగా నిండి గేట్లు ఎత్తే పరిస్థితి వస్తే గేట్ల స్తంభాలు కూలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఏఈ మాట్లాడుతూ తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.75 వేలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. ఇదిలావుంటే, రైతులంతా కలిసి డెక్కన్ యాజమాన్యాన్ని కలిసి సీఎస్ఆర్ నిధులతో ఈ పనులు చేపట్టాలని కోరుదాం అని నిర్ణయించారు. రైతులు కోనేటి నాగేశ్వరరావు, పిడుగు దేవడు రాజు, శివాజీరాజు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మను దర్శించుకున్న స్పీకర్ అయ్యన్న



ఆలయంలోకి అయ్యన్నకు కూటమి శ్రేణులు స్వాగతం

కశింకోట, జూన్ 29 : మండలంలోని తాళ్లపాలెంలో నూకాలమ్మను స్పీకర్ అయ్యన్నపాత్రుడు శనివారం దర్శించుకున్నారు. స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా జిల్లాకు వచ్చిన ఆయనకు ఇక్కడ టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ ఆధ్వర్యంలో కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, ఒమ్మి సత్యనారాయణ, సత్తిబాబు, పక్కుర్తి సంతోష్, బుజ్జి, నైనంశెట్టి రమణారావు, పెదపాటి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



పరవాడ, జూన్ 29 : వముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం పంచాయతీల పరిధి హనుమాన్‌నగర్‌లో కొలువుదీరిన అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం ఆదివారం జరగనుంది. ఇందుకు సంబంధించి కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

నూకాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ఎస్.రాయవరం, జూన్ 29 : కొరుప్రోలులో కొలువుదీరిన నూకాలమ్మ ఆలయంలో హుండీని శనివారం లెక్కించారు. ఆలయ ఈవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రక్రియలో మొత్తం రూ.1,31,520 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాబూరావు, అమ్మవారి సేవకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పాల సొసైటీ డైరెక్టర్లు ఏకగ్రీవ ఎన్నిక

సబ్బవరం, జూన్ 29 : నల్లరేగులపాలెంలో శనివారం జరిగిన పాల సొసైటీ డైరెక్టర్ల ఎన్నికల్లో టీడీపీకి చెందిన పి.గోవిందరావు, పి.అప్పలనర్సమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సొసైటీ అధ్యక్షుడు పి.జగ్గారావు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో పాలకవర్గ సభ్యులతో పాటు మాజీ సర్పంచ్ కుచ్చర్లపాటి రామకృష్ణరాజు, రామాంజనేయలు పాల్గొన్నారు.

'కళలకు గ్రామాలే పుట్టినిల్లు'

అచ్యుతాపురం రూరల్, జూన్ 29 : కళలకు గ్రామాలే పుట్టినిల్లు అని జబర్దస్త్ ఆర్టిస్టు సత్తిపండు అన్నారు. మండలంలోని యర్రవరం గ్రామానికి చెందిన వర్ధమాన దర్శకుడు వీపీ వెంకట్ గ్రామీణ కళాకారులతో నిర్మించిన 'గరళం' అనే లఘు చిత్రాన్ని హరిపాలెంలో శుక్రవారం సాయంత్రం ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు కర్రి శ్రీను, కె.కిరణ్, తారాగణం పి.జగదీష్, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సెట్‌లో ర్యాంకులు సాధించిన వారికి సత్కారం

ఎలమంచిలి, జూన్ 29 : పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తాజాగా విడుదలైన పీజీ సెట్, సీయూ సెట్‌లో మంచి ర్యాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిని శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అభినందించారు. పీజీ సెట్ ఫిజిక్స్ విభాగంలో ఎస్.వంశీ మూడో ర్యాంకు, పి.వెంకటేష్ 15వ ర్యాంకు, డి.రూపావతి 18వ ర్యాంకు పొందారన్నారు. అలాగే మరికొంత మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు. వీరిని తీర్చిదిద్దిన అధ్యాపకులను కూడా అభినందించారు.

మంత్రి లోకేశ్‌కు చిత్రపటం బహూకరణ



లోకేశ్, బ్రాహ్మణి దంపతుల చిత్రపటం అందిస్తున్న బుద్ద

అనకాపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులను శనివారం ఉండవల్లిలోని వారి స్వగృహంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు కలిశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లోకేశ్, బ్రాహ్మణి దంపతుల చిత్రపటాన్ని బహూకరించారు.

కోటవురట్లలో మంత్రి అనితకు ఘన స్వాగతం



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి అనిత

కోటవురట్ల, జూన్ 29 : మండల కేంద్రం కోటవురట్లలో హోం మంత్రి వంగలపూడి అనితకు కూటమి శ్రేణులు శనివారం ఘన స్వాగతం పలికారు. శాసన సభ స్పీకర్‌గా ఎన్నికై తొలిసారిగా జిల్లాకు వస్తున్న అయ్యన్నపాత్రుడు సన్మాన కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఎస్.రాయవరం మండలం, అడ్డురోడ్డులోని ఆమె నివాసం నుంచి బయలుదేరిన అనిత కోటవురట్లకు చేరుకోగానే భారీగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి స్వాగతం పలికారు. టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పి.సూర్యారావు, సుంకర్ బాబ్జీ, జనసేన మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు తదితరులు పూల మాలలు వేసి సత్కరించారు.

కృష్ణవీధిలో కూలిన పెంకుటిల్లు




కూలిన ఇల్లును పరిశీలిస్తున్న కూటమి నాయకులు

పాయకరావుపేట, జూన్ 29 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని కృష్ణవీధిలో అల్లు అమ్మాజీకి చెందిన పెంకుటిల్లు పైకప్పు శుక్రవారం రాత్రి కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు పక్కగదిలో నిద్రిస్తుండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర తదితరులు బాధితులను పరామర్శించారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి

పరవాడ, జూన్ 29 : బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని వాడచీపురుపల్లి సర్పంచ్ శివలంక లక్ష్మి సూచించారు. పంచాయతీ పరిధి పందివానిపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

'శ్రీనివాసరావు సేవలు అభినందనీయం'



శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అచ్యుతాపురం/రూరల్ , జూన్ 29 : మండల కేంద్రం అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్న బుడుమూరు శ్రీనివాసరావును తోటి ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను ఎంఈవో కృష్ణదేవరాయలు అభి నందించారు. అనంతరం శ్రీనివాసరావు దంపతులకు శాలువా కప్పి, సత్కరించారు. హెచ్ఎం పద్మావతి, పూజారి చిన్నబాబు, శ్రీరామమూర్తి, శాస్త్రి, నూకరాజు, చిరంజీవి, శ్యామ్, అమ్మోరయ్య, పార్వతి పాల్గొన్నారు.

అతిసారపై ప్రజలకు అవగాహన

అనకాపల్లి టౌన్, జూన్ 29 : జీవీఎంసీ 17, 18 వార్డు సచివాలయాల్లో వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం పర్యటించి అతిసారపై ప్రజలకు అవగాహన కల్పించింది. జూలై ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు జరగబోయే స్టాప్ డయేరియా ప్రోగ్రాంపై వివరించారు. తొలుత అరుంధతీనగర్‌లోని యూపీహెచ్ఎస్‌ను పరిశీలించిన అనంతరం సచివాలయాల్లో రికార్డులను బృందం తనిఖీ చేసింది. టాస్క్‌ఫోర్స్ బృంద లీడర్ డాక్టర్ లూసీ కార్డిలియా సూచనలు చేశారు. గణాంకాధికారి రామచంద్రరావు, నాగమణి, జగన్నాథ్, జగదీష్, నానాజీ పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో టీడీపీ నేతలకు ఘన సన్మానం



వినోద్‌రాజు, అబద్ధం, నరసింహమూర్తిని సన్మానిస్తున్న శ్రేణులు

ఎస్.రాయవరం, జూన్ 29 : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత అఖండ మెజార్టీతో విజయం సాధించి, మంత్రి పదవి చేపట్టడంతో మండలంలోని ఆ పార్టీ శ్రేణులు మంచి ఉత్సాహంగా ఉన్నారు. ఇందులో భాగంగా ఎస్.రాయవరం మండలంలో పార్టీని కష్టకాలంలో సైతం ముందుండి నడిపించి, ఘన విజయానికి కారుకులైన మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తిలను శనివారం ఇక్కడ పార్టీ సీనియర్ నాయకుడు వజ్రపు శంకరరావు అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ సమష్టి కృషివల్లే ఈ విజయం సాధించినట్టు చెప్పారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో అంతా ముందుకు సాగి మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని టీడీపీ సీనియర్ నాయకుడు కందుల వెంకటేశ్వరరావు నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్.వెంకటరాజు, టి.ఎరకయ్య, సీనియర్ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, తుమ్మపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, పల్లెల జగ్గారావు, పడమటి సతీష్, సుంకర శ్రీనివాసరావు, బండి నాగేశ్వరరావు తదితరులతో పాటు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర, అక్రమాల జాతర

... 5వ పేజీ తరువాయి

పోలీస్ శాఖలో రిటైరైన ఖాన్‌ను తీసుకువచ్చి వర్సిటీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించారు. ఆయనకు నెలకు రూ.75 వేలు వేతనంతోపాటు మరో రూ.20 వేలు వరకు అలవెన్స్ ఇస్తున్నారు. మొత్తం రూ.95 వేలు వర్సిటీ నిధుల నుంచి చెల్లిస్తున్నారు. యూనివర్సిటీలో అప్పటికే సుమారు 100 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తుండగా, ఖాన్ తనకు కావాల్సిన మరో 50 మందిని సెక్యూరిటీ సిబ్బందిగా తీసుకున్నారు. వీరంతా ప్రసాదరెడ్డి సేవలోనే తరించేవారు. ఏయూలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి రూ.10 వేలకు మించి వేతనాలు చెల్లించడం లేదు. ఖాన్ తీసుకువచ్చిన సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం అలవెన్సులతో కలిపి సుమారు రూ.20 వేలకుపైగా ఇస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందిగా నియామకం సమయంలో ఖాన్‌కు వారంతా భారీగానే సమర్పించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే, ఖాన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమితులైన తరువాత ట్రాన్స్‌పోర్ట్ డీన్‌గా కూడా వీసీ అవకాశం కల్పించారు. ఈ బాధ్యతలను ఖాన్ 'చక్కగా' వినియోగించుకున్నట్టు చెబుతున్నారు. ఏయూ వాహనాలకు ఆయిల్, ఇతర మరమ్మతులు నిర్వహణ పేరుతో నిధులు దుర్వినియోగం చేశారంటున్నారు. పూర్తిగా మూలకు చేరిన వాహనాలను విక్రయించుకున్నారని...ఆయన తీసుకున్న నిర్ణయాలపైనా విచారణ చేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

దాతల ఇచ్చిన నిధుల లెక్క..?

గడిచిన ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా యూనివర్సిటీ అధికారులు దాతల నుంచి భారీగా నిధులు సేకరించారు. కొందరు సొంత నిధులతో భవనాలు కట్టించగా, మరికొందరు వర్సిటీ అభివృద్ధికి వినియోగించాలంటూ నిధులు అందించారు. ఈ నిధులను ఏ ఖాతాలో జమ చేశారన్న దానిపై వర్సిటీ అధికారులకు సమాచారం లేకపోవడం గమనార్హం. వీటి వినియోగంపైనా దృష్టిసారిస్తామని కూటమి నేతలు శనివారం ప్రకటించారు.

'సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పన'



మోసయ్యపేటలో సంత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అచ్యుతాపురం, జూన్ 29 : మండల కేంద్రం అచ్యుతాపురంతో పాటు మోసయ్యపేటలో గల సంతల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తహసీల్దార్ సరోజిని తెలిపారు. ఈ రెండు సంతలు నిర్వహించే ప్రదేశాలను శనివారం ఆమె పరిశీలించారు. అచ్యుతాపురం సంత మండల కేంద్రాన్ని అనుకొని ఉంది. మోసయ్యపేట సంత అచ్యుతాపురం- గాజువాక ప్రధాన రహదారిలో గురుకుల బాలికల పాఠశాల వద్ద ఉంది. అచ్యుతాపురం సంతలో ఇప్పటికే కొన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. అయితే మోసయ్యపేట సంత ప్రతి ఆది, సోమ, బుధ, శుక్రవారాల్లో వారానికి నాలుగు రోజులు జరుగుతుంది. అచ్యుతాపురం- గాజువార ప్రధాన రహదారిలో ఈ సంత జరుగుతుండడం వల్ల వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఫలితంగా సంత రోజుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఎదురవుతోంది. ఈ నేపథ్యంలోనేతాను పరిశీలించినట్టు తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీవో సురేష్ కుమార్, ఆర్ఐ కుమార్, పంచాయతీ కార్యదర్శి అమ్మాజీ పాల్గొన్నారు.





ఫ్లెక్సీల ధ్వంసంపై టీడీపీ ఫిర్యాదు

» ఎనిమిది మంది అరెస్టు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

మాకవరపాలెం, జూన్ 29 : టీడీపీ ఫ్లెక్సీలు చించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ మండల టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. శాసనసభ స్పీకర్‌గా ఎన్నికై చింతకాయల అయ్యన్నపాత్రుడు తొలిసారిగా నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా శెట్టిపాలెం నుంచి రోడ్డు మార్గంలో టీడీపీ నేతలు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే రామన్నపాలెం సెంటరులో ఏర్పాటు చేసిన ఆరు ఫ్లెక్సీలను వైసీపీ నాయకులు చించివేశారంటూ టీడీపీ నాయకులు పోలీసుస్టేషన్ ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు మాటాడుతూ గత శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు రామన్నపాలెం సెంటరులో టీడీపీ కార్యకర్తలు ఫ్లెక్సీలు కడుతుంటే రామన్నపాలెం సర్పంచ్, వైసీపీకి చెందిన మాకిరెడ్డి అయ్యప్పతో పాటు కచ్చళ్ల లక్ష్మణ్‌రావు బెదిరించారన్నారు. ఇక్కడ ఫ్లెక్సీలు కడితే చించివేస్తామంటూ కొట్టేందుకు సిద్ధపడ్డారన్నారు. అయితే తాము రాత్రి 11 గంటల వరకు ఫ్లెక్సీలు కట్టి ఇంటికి వెళ్లిపోయామని తెలిపారు. ఉదయం ఆరు గంటలకు వచ్చి చూసేసరికి ఫ్లెక్సీలు చించివేసి ఉన్నాయని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫ్లెక్సీల చించివేశారంటూ అల్లు కన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. వీరిలో మాకిరెడ్డి అయ్యప్ప (సర్పంచ్), చల్లా గణేష్, ఏకా నాగబాబు, ఏకా శంకర్‌రావు, కచ్చళ్ల లక్ష్మణ్‌రావు, గొల్లి బాలరాజు, కూండ్రపు అప్పలనాయుడు, కోరుప్రోలు నాయుడు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్టు చెప్పారు.

విద్యుదాఘాతంతో ఇంట్లో అగ్నిప్రమాదం

» రూ.4 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన ఎలక్ట్రానిక్ పరికరాలు

చోడవరం, జూన్ 29 : పట్టణంలోని గునిశెట్టివారివీధిలోని తేలపల్లి నాగేశ్వరరావు ఇంట్లో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతం కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని ఏసీ, సీలింగ్ ఫ్యాన్లు, కూలర్, టీవీలతో పాటు, ఇంట్లో ఇతర విలువైన వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. వైరింగ్ పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో కుటుంబ సభ్యులు వ్యక్తిగత పనుల మీద ఉదయం బయటకు వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో అన్ని వస్తువులు పూర్తిగా కాలిపోయి ఉన్నాయి. దీనితో అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో సుమారుగా రూ. 4 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు నాగేశ్వరరావు తెలిపారు.

చెట్లు నరికివేత అన్యాయం : మాజీ ఎమ్మెల్యే గణేష్

నాతవరం, జూన్ 29 : పంట పొల్లాల్లో ఉన్న జీడి చెట్లను నరికి ధ్వంసం చేయడం అమానుషమని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పేర్కొన్నారు. నాతవరం మండలం డి.యర్రవరంలో సబ్బవరపు వెంకునాయుడు అనే రైతుకు చెందిన జీడిచెట్లు, కొబ్బరి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నరికివేశారు. దీంతో శనివారం మాజీ ఎమ్మెల్యే గణేష్ స్థానిక నాయకులతో కలసి నరికివేసిన చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ ఇటువంటి వారిని పోలీసులు గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. సుమారు 10 మంది వరకు ఈ ఘటనలో పాల్గొన్నట్టు స్థానికులు అనుమానిస్తున్నారు.

'గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి'



రోగులతో మాట్లాడుతున్న లోకనాథం

నర్సీపట్నం, జూన్ 29 : సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో విరివిగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని, పారిశుధ్యం మెరుగుపరచి దోమలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, కార్యదర్శివర్గ సభ్యుడు కోటేశ్వరావు డిమాండ్ చేశారు. శనివారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిని సందర్శించినఆయన జ్వరాలతో బాధపడుతున్న రోగులతో మాట్లాడి గ్రామాలలో పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ నీలవేణి దేవిని కలిసి గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని కోరారు.

నిధులకు పూచీ నాది..అభివృద్ధి బాధ్యత మీది

» మండల సమావేశంలో అధికారులతో ఎమ్మెల్యే 'బండారు' » కె.కోటపాడును ఆదర్శంగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



పాల్గొన్న సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు

కె.కోటపాడు, జూన్ 29 : కె.కోటపాటు మండలాన్ని ప్రగతిపథంలో నడిపించడానికి అధికారులు పూర్తి స్థాయిలో పని చేయాలని, నిధులు లేవన్న సాకుతో చిన్న చిన్న పనులను కూడా ఆటంక పరచకుండా పని చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధికారులకు స్పష్టం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తొలిసారిగా విచ్చేసిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అనేక విషయాలను అధికారులతో చర్చించారు. ఏ శాఖలోనూ నిధులు లేవన్న చర్చ రాకూడదని, నిధుల విష యం తనకు పూర్తిగా వదిలి వేయాలన్నారు. అధికారులు అభివృద్ధి విషయంలో మాత్రం పోటీ పడాలన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రజా ప్రతినిధులందరూ ప్రజలకు సేవ చేయడానికే ఉండాలన్నారు. పార్టీలు పక్కన పెట్టి కె. కోటపాడును ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుం అని పిలుపునిచ్చారు. విద్యాశాఖ, అంగన్‌వాడీ, వెలుగు, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఇండస్ట్రియల్‌లో యజమానుల సహాయం కోరుదామని సూచించారు.

గతంలో ఇదే తరహాలో పెందుర్తి మండలాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అలాగే స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్, విశాఖ పోర్టు ట్రస్ట్ తదితర భారీ కర్మాగారాల నుంచి నిధులు సమీకరించి అనేక పనులు చేసుకోవచ్చనన్నారు. కె.కోటపాడులో ఉన్న 50 పడకల ఆస్పత్రిని దాతల సహాయంతో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పట్నాయక్, తహసీల్దార్ ఈశ్వరమ్మ, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలకార్మికులతో పని చేయిస్తే కఠిన చర్యలు

జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.లోవరాజు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చీడికాడ, జూన్ 29 : ఆరు నుంచి 18 ఏళ్లలోపు బాలకార్మికులను హోటళ్లు, కిరాణాషాపుల్లో గాని పనులు చేయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.లోవరాజు హెచ్చరించారు. చీడికాడలో శనివారం కార్మికశాఖ డివిజన్ అధికారి సూర్యనారాయణతో కలిసి భోజన హోటళ్లు, కిరాణాషాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు, మహిళ పోలీసులతో కలిసి చీడికాడ పోలీస్‌స్టేషన్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై వయస్సు గల పిల్లలు ఉంటే వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఝాన్సీలక్ష్మి సేవలు అమోఘం

ఏపీటీఎఫ్ నేతలు ప్రశంస

చీడికాడ, జూన్ 29 : ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసి పదవీ విరమణ చేస్తున్న దామరాజు ఝాన్సీలక్ష్మి చేసిన సేవలు అమోఘమని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మహాలక్ష్మీనాయుడు అన్నారు. మండలంలో కోనాం శివారు జాజులపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఝాన్సీలక్ష్మి స్వచ్ఛందంగా పదవీ విరమణ కార్యక్రమాన్ని చినకోనాం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు బొంజుబాబు, బీవీ రమణ, ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిపిఎ.నాయుడు, పివిమూర్తి, స్థానిక ఉపాధ్యాయులు కసిరెడ్డి రమేష్, తదితర ఉపాధ్యాయులు ఝాన్సీలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు.

ఫించన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు : ఎంపీడీవో జాన్ లింకన్

రోలుగుంట, జూన్ 29 : ఫించన్ల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంపీడీవో జాన్ లింకన్ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచే ఫించన్ల పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. పక్కా ప్రణాళికతో పింఛన్లు పంపిణీ చేయాలన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

» తహసీల్దార్‌కు సీపీఐ నేతల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గొలుగొండ, జూన్ 29 : కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలపై తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ భాస్కరరాజుకు సీపీఐ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏపీ రైతు సంఘ జిల్లా నాయకుడు మేకా సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో అందించే రూ.ఇరవై వేలు జూన్‌లోనే అందించాలన్నారు. ఈ మొత్తాన్ని జూలైలో రైతులు వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. కల్తీ విత్తనాలు విక్రయాలను అరికట్టాలన్నారు. స్మార్టు మీటర్లు రద్దు చేసి విద్యుత్ చార్జీల మోత తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ నాయకులు జి.గురుబాబు, సీపీఐ జిల్లా నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, సీపీఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, నాయకులు జి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వూషూ టోర్నమెంట్‌లో పలువురికి స్వర్ణ పతకాలు



వూషూలో పతకాలు సాధించిన క్రీడాకారులు

నర్సీపట్నం, జూన్ 29 : ఆంధ్రప్రదేశ్ వూషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో 27, 28 తేదీలలో జరిగిన పదో రాష్ట్ర స్థాయి జూనియర్ వూషూ టోర్నమెంట్‌లో స్థానిక నింజాస్ అకాడమీ క్రీడాకారులు బంగారం, కాంస్య పతకాలు సాధించారు. ఎన్టీఆర్ మినీస్టేడియంలోని నింజాస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విత్తనాల లోకేష్ (60 కిలోలు), రౌతు నాగలక్ష్మి (56 కిలోలు) బంగారు పతకాలు, బొమ్మల రాజరాజేశ్వరి (52 కిలోలు), అప్పికొండ వంశీ (54 కిలోలు) కాంస్య పతకాలు సాధించారని యర్రా శేఖర్ తెలిపారు.

'లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం'



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రత్నకుమార్

చోడవరం, జూన్ 29 : జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తున్నందున, కక్షిదారులు లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.రత్నకుమార్ సూచించారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో వివిధ కేసులు 80 కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఇ.రాజేంద్రబాబు, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.రమేష్, న్యాయవాదులు బి.ఫైడిరాజు, కె. అప్పలనాయుడు కక్షిదారులు పాల్గొన్నారు.

జనసేనలోకి ఇద్దరు వార్డు మెంబర్లు

బుచ్చెయ్యపేట, జూన్ 29 : వడ్డాది మేజరు పంచాయతీకి చెందిన ఇద్దరు వార్డు మెంబర్లు జనసేన పార్టీలో చేరారు. వైసీపీ మద్దతు దారులైన 10, 11 వార్డు మెంబర్లు బేరా రామలక్ష్మి, బొది కృష్ణలు శనివారం చోడవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీ ఎస్ఎన్ రాజు సమక్షంలో జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దాడి సూర్యనాగేశ్వరరావు, దొండా సన్యాసిరావు, వీర్ల సురేష్, కుబిరెడ్డి వెంకటరావు, దొండా సాయి పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాల భూముల్లో విత్తనాలు వేస్తున్నరైతులు

దేవరాపల్లి, జూన్ 29 : నీటి ఆదరువు కలిగి చెరువులు కింద ఉన్న ఆయకట్టు కింద భూముల్లో రైతులు వరి విత్తనాలు వేస్తున్నారు. తుఫాన్ వర్షం వస్తే నారు మల్లు ఆరుదల ఉండదని, విత్తనం వేయడానికి అనుకూలంగా ఉండదని రైతులు ఇప్పుడు విత్తనాలు వేస్తున్నారు.

మీ రుణం తీర్చుకోలేనిది

... 5వ పేజీ తరువాయి

చంద్రబాబును తీవ్రంగా అవమానించిన జగన్మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా లేకుండా పోయిందని, ఇదే దేవుడి స్క్రిప్ట్ అని అన్నారు. ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కలిసి సభాపతిని చైర్‌లో కుర్చోబెట్టడం సంప్రదాయమని, జగన్‌మోహన్ రెడ్డికి ఆ ఇంకిత జ్ఞానం కూడా లేదన్నారు. అటువంటి వ్యక్తిని ఐదేళ్లు సీఎంగా భరించామని ఎద్దేవా చేశారు. అందుకే ఎన్నికలలో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి తరిమి తరిమి కొట్టారని విమర్శించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్‌లను నాలుగు మండలాలు, మునిసిపాలిటీ పార్టీ నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి విజయ్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, సుందరపు విజయ్‌కుమార్, కేఎస్ఎన్ రాజు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే బోళం ముత్యాలపాప, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు, తోట నగేశ్, జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర, జడ్పీటీసీ సుకల రమణమ్మ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర.. అక్రమాల జాతర

... 5వ పేజీ తరువాయి

పోలీస్ శాఖలో రిటైరైన ఖాన్‌ను తీసుకువచ్చి వర్సిటీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమించారు. ఆయనకు నెలకు రూ.75 వేలు వేతనంతో పాటు మరో రూ.20 వేలు వరకు అలవెన్స్ ఇస్తున్నారు. మొత్తం రూ.95 వేలు వర్సిటీ నిధుల నుంచి చెల్లిస్తున్నారు. యూనివర్సిటీలో అప్పటికే సుమారు 100 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తుండగా, ఖాన్ తనకు కావాల్సిన మరో 50 మందిని సెక్యూరిటీ సిబ్బందిగా తీసుకున్నారు. వీరంతా ప్రసాదరెడ్డి సేవలోనే తరించేవారు. ఏయూలో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేసే సెక్యూరిటీ సిబ్బందికి రూ.10 వేలకు మించి వేతనాలు చెల్లించడం లేదు. ఖాన్ తీసుకువచ్చిన సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం అలవెన్సులతో కలిపి సుమారు రూ.20 వేలకు పైగా ఇస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందిగా నియామకం సమయంలో ఖాన్‌కు వారంతా భారీగానే సమర్పించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే, ఖాన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమితులైన తరువాత ట్రాన్స్‌పోర్ట్ డీన్‌గా కూడా వీసీ అవకాశం కల్పించారు. ఈ బాధ్యతలను ఖాన్ 'చక్కగా' వినియోగించుకున్నట్టు చెబుతున్నారు. ఏయూ వాహనాలకు ఆయిల్, ఇతర మరమ్మతులు నిర్వహణ పేరుతో నిధులు దుర్వినియోగం చేశారంటున్నారు. పూర్తిగా మూలకు చేరిన వాహనాలను విక్రయించుకున్నారని... ఆయన తీసుకున్న నిర్ణయాలపైనా విచారణ చేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

దాతల ఇచ్చిన నిధుల లెక్క..?

గడిచిన ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా యూనివర్సిటీ అధికారులు దాతల నుంచి భారీగా నిధులు సేకరించారు. కొందరు సొంత నిధులతో భవనాలు కట్టించగా, మరికొందరు వర్సిటీ అభివృద్ధికి వినియోగించాలంటూ నిధులు అందించారు. ఈ నిధులను ఏ ఖాతాలో జమ చేశారన్న దానిపై వర్సిటీ అధికారులకు సమాచారం లేకపోవడం గమనార్హం. వీటి వినియోగంపైనా దృష్టిసారిస్తామని కూటమి నేతలు శనివారం ప్రకటించారు.

ఉద్యాన రైతులకు ఊతమేది?

... 5వ పేజీ తరువాయి

బడుగు వికాశ్ కింద వాహనం కొనుగోలుచేసి సబ్సిడీకి జిల్లా పరిశ్రమల కేంద్రానికి దరఖాస్తు చేస్తే ఇప్పటి వరకు పలు రకాల కొర్రీలు వేస్తున్నారని ఆరోపించారు. జడ్పీటీసీ సభ్యురాలిగా తన పరిస్థితే ఇలా ఉంటే సామాన్య ప్రజలను అసలు పట్టించుకుంటారా? అని ఆవేదన వ్యక్తం చేయగా సీఈవో పోలినాయుడు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారికి ఆదేశించారు.

ఎమ్మెల్యేలకు త్వరలో కమిటీలో స్థానం

ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్యేలను త్వరలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల్లో సభ్యులుగా నియమించనున్నట్టు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. శనివారం జడ్పీ హాలులో ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ వచ్చే సర్వసభ్య సమావేశంలో నియామకాలు పూర్తిచేస్తామన్నారు. అరకులోయ ఎమ్మెల్యేగా ఎన్నికైన హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు ఆర్.మత్స్యలింగంను ఈ సందర్భంగా అభినందించారు.

ఆగని గ్రావెల్ దందా

... 5వ పేజీ తరువాయి

రద్దు చేసినట్టు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన గ్రావెల్ క్వారీల నిర్వాహకులు గనులు, కమర్షియల్ ట్యాక్స్ శాఖలకు జీఎస్‌టీ కింద చదరపు క్యూబిక్ మీటరు గ్రావెల్ తవ్వినందుకు రూ.100 వరకు చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో పలు మండలాల్లో ప్రధానంగా అనకాపల్లి, సబ్బవరం, అచ్యుతాపురం, పరవాడ, కశింకోట మండలాల్లో కొందరు రియల్టర్లు స్థానిక నాయకులతో చేతులు కలిపి ఎటువంటి అనుమతులు పొందకుండానే ఇష్టానుసారంగా ప్రభుత్వ భూముల్లో సైతం గ్రావెల్ తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్టు వేయాలని కోరుతున్నారు.

జిల్లాలో గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్న వైనంపై గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా గ్రావెల్ తవ్వకాలకు కొత్తగా ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. సబ్బవరంలో పది మందికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల ప్రకారం కొత్తగా గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని, అంత వరకు ఎవరికీ గ్రావెల్ తవ్వకాలు అనుమతులు లేవని స్పష్టం చేశారు.

☛ సంక్షిప్తంగా..

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

బుచ్చెయ్యపేట, జూన్ 29 : జులై నెల పింఛన్లు ఇంటింటికే పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో శ్రీకాంతాచార్యులు తెలిపారు. 22 క్లస్టర్ల వారీగా సచివాలయాల సిబ్బంది పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బుచ్చెయ్యపేట క్లస్టర్ పరిధిలో 885, చింతపాక 442, దిబ్బిడి 644, గంటికొర్లాం 383, గున్నెంపూడి 429, కె పీ.అగ్రహారం 351, కందిపూడి 468, లోపూడి 704, మల్లాం 335, మంగళాపురం 325, పి.భీమవరం 363, పెదమదీన 392, పెదపూడి 383, వీపీ.అగ్రహారం 279, పొట్టిదొరపాలెం 367, ఆర్.శివరామపురం 535, రాజాం 774, తురకలపూడి491, వైపురం 446, వడ్డాది-1లో 671, వడ్డాది-2లో 646, విజయరామరాజుపేట క్లస్టర్ పరిధిలో 484 అన్ని కేటగిరి పింఛన్లు పంపిణీ కోసం రూ.7 కోట్లు, 27 లక్షల, 38 వేల రూపాయిల నగదు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో శ్రీకాంతాచార్యులు తెలిపారు.

డి.శ్రీనివాస్ మృతిపై ధర్మశ్రీ సంతాపం

చోడవరం, జూన్ 29 : ఉమ్మడి రాష్ట్ర పీసీసీ మాజీ అధ్యక్షుడు మాజీ మంత్రి డి.శ్రీనివాస్ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శనివారం సంతాపం తెలిపారు. తనకు రాజకీయ గురువైన డి.శ్రీనివాస్ మృతి చెందడం తనకువ్యక్తిగతంగా తీరనిలోటన్నారు. ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే తాను ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పని చేశానని గుర్తు చేశారు. ఆయన ఆత్మకుశాంతి కలగాలని ధర్మశ్రీ ఆకాంక్షించారు.

నేడు బిల్లుల చెల్లింపునకు అవకాశం

చోడవరం, జూన్ 29 : విద్యుత్ వినియోగదారులు ఈ నెల 30న (ఆదివారం) అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని స్థానిక ఈపీడీసీఎల్ ఏడీ ఈయు,. కుమార్ గౌరీవరప్రసాద్ తెలిపారు. ఆదివారం కూడా విద్యుత్ బిల్లుల కౌంటర్లు తెరిచే ఉంటాయని వినియోదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

2న మండల సర్వసభ్య సమావేశం

రోలుగుంట, జూన్ 29 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జూలై 2న (మంగళవారం) నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో జాన్ లింకన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలని కోరారు.

పాల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



చోడవరం, జూన్ 29 : పట్టణ పరిధిలోని ఎడ్లవీధి (ఊకపేట) విశాఖడెయిరీ పాల సంఘం అధ్యక్షునిగా టీడీపీ నేత ఈర్లె శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలసంఘం అధ్యక్ష పదవికి శనివారం నిర్వహించిన ఎన్నికల్లో శ్రీనివాస్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనివాస్ వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం విశేషం. సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను సంఘం డైరెక్టర్లు, సభ్యులు, టీడీపీ నేతలు అభినందించారు.

103 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

కృష్ణాదేవిపేట, జూన్ 29 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి మైత్రి గ్రంథాలయంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశా రు. ఈ శిబిరాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించారు. సుమారు 103 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితమందులు, తదితర వైద్యసేవలు చేశారు. వీరిలో 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యాధికారులు నిఖిత, రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ సిబ్బంది లావణ్య, వరహాలు పాల్గొన్నారు.

'నాణ్యమైన విద్య అందిస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం రామకృష్ణ

చీడికాడ, జూన్ 29 : మండలంలోని తురువోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు తమ ఉపాధ్యాయులమంతా సిద్ధంగా ఉన్నామని పాఠశాల హెచ్ఎం రామకృష్ణ అన్నారు. తురువోలు హైస్కూల్‌లో శనివారం మధ్యాహ్నం తల్లిదండ్రుల సమావేశం జరిగింది. పలు విషయాలపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంఈవో బీవీ రమణ, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు జీపీఏ నాయుడు పాల్గొన్నారు.

'పర్యావరణాన్ని పరిరక్షిద్దాం'



మొక్కలు నాటుతున్న సర్పంచ్

గొలుగొండ, జూన్ 29 : మండలంలోని ధారమటం శివాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. మండలంలోని పాతమల్లంపేట శివారుకొత్తపాలెం వద్ద గల శివాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, టీడీపీ మండల తెలుగుయువత ఉపాధ్యక్షుడు గెడ్డం ఆనంద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఇంటివద్ద మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





